క్లుప్తంగా

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట పూజలు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి గాజుల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ హనుమత్ సమేత సీతారామ లక్ష్మణుల విగ్రహ, ధ్వజ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. బుధ, గురు వారాలు పూజాది కార్యక్రమాలు, శుక్రవారం విగ్రహ, ధ్వజమూర్తుల ప్రతిష్ట, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 5 గంటల నుంచి స్వామివార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

వైభవంగా వసంతోత్సవం

నందలూరు : మండలంలోని అరవపల్లిలోని క్రీడా మైదానం వద్ద వెలసిన శ్రీ కోదండ రామ స్వామి ఆలయ శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పెద్దలు, యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపు స్థానిక బస్టాండ్ కూడలి వరకు సాగింది. భక్తులు కాయా కర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు.

ఘనంగా గ్రామోత్సవం

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట శ్రీ సీతారామ కాలనీలో బుధవారం శ్రీ పట్టాభి సీతారాముల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వామి, అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. పలువురు భక్తులు భజనలు చేస్తూ ఆనందోత్సాహంతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రజలు కాయా, కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో గ్రామ పురవీధులలో ఊరేగించారు.

చలివేంద్రం ఏర్పాటు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ అరవపల్లిలో విశ్రాంత రైల్వే ఉద్యోగి, మాజీ రైల్వే భారత్ స్కౌట్ గ్రూప్ కమిషనర్ షేక్ కమాల్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని సర్పంచ్ జంబు సూర్యనారాయణ ప్రారంభించారు. బుధవారం కమాల్ బాషా ఆధ్వర్యంలో తొలిరోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఘన నివాళి



సుబ్బారెడ్డికి నివాళులర్పిస్తున్న కొరముట్ల

ఓబులవారిపల్లె : అనారోగ్యంతో మృతి చెందిన అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి సానుగారి సుబ్బారెడ్డి (75) మృతదేహాన్ని బుధవారం వైఎస్సార్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరముట్ల శ్రీనివాసులు సందర్శించి నివాళులర్పించారు. మండల కేంద్రంలో నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఓజీ శ్రీనివాసులు రెడ్డి, శివారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు టంగుటూరి కృష్ణారెడ్డి, ఓజీ పాపిరెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ సుంకేసుల రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బంధువులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించండి

సుండుపల్లె : మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలోని అన్ని పల్లెలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కరించాలన్నారు.

ఏసీఎం పోకల స్ప్రేయింగ్‌తో దోమల నివారణ

ఒంటిమిట్ట : ఏసీఎం పోకల స్ప్రేయింగ్‌తో దోమలను నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంటపంపల్లి ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలలో సిద్ధవటం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో దోమల నివారణకు ఏసీఎం 5 శాతం పోకల స్ప్రేయింగ్ చేయించారు. ఈనెల 18, 19 తేదీలలో చింతరాజుపల్లి గ్రామ పంచాయతీలోని పత్రపల్లి, చేనువారిపల్లి, కోమిటిపల్లి, బోటుక్రిందపల్లెల్లో స్ప్రేయింగ్ నిర్వహించబోతున్నట్లు అధికారులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి

సంబేపల్లె : సాగులో సమగ్ర ఎరువులతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నమయ్య జిల్లా రాయచోటి డివిజన్ వ్యవసాయ శాఖ సంచాలకులు శ్రీలత, కేవీకే శాస్త్రవేత్త మాధురీలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోటకట్ల ఆర్‌బీకేలో వ్యవసాయ సిబ్బందికి రైతులు సాగుచేస్తున్న పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను, వాటి ప్రయోజనాలు, వాటిని ఎల అమలు చేయాలన్న దానిపై వివరించారు.

రామా.. మా మొర వినుమా!

- 2015లో కోదండ రామాలయం అభివృద్ధి నోటీసులు లేకుండా నిర్మాణాలు కూల్చివేత
- దశాబ్దంపాటు కార్యాలయాల చుట్టూ తిరిగిన అందని నష్ట పరిహారం
- తాము ఇచ్చిందే తీసుకోవాలంటూ అధికారుల అల్టిమేటం
- న్యాయం చేయాలని కోరుతున్న బాధిత కుటుంబ సభ్యులు



బాధితుల స్థలం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని 2014లో ఆంధ్ర భద్రాద్రిగా అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆ తరువాత 2015లో టీటీడీలో విలీనం చేసి ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికీ చేస్తున్నారు. 2015వ సంవత్సరంలో ఆలయ అభివృద్ధికి రామాలయానికి దక్షిణవైపు సర్వే నెంబరు 1500/బి1లో ఉన్న గృహాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారు. కూల్చిన 86 గృహ నివాసులకు ఒంటిమిట్టలోని శ్రీరామనగర్ కాలనీలో స్థలాలు కేటాయించి 1ప్లస్1 మోడల్ గృహాలను నిర్మించి ఇచ్చారు. అయితే ఈ తొలగింపు చర్యల్లో అక్కడే ఉన్న యనమల చిన్న వెంకటరమణయ్య, ఆయన సతీమణి సుధామణికి సంబంధించి పక్కా ధృవపత్రాలు కల్గిన 43.5 సెంట్ల స్థలంలో 6 సెంట్లలో రైస్ మిల్లు, 7.5 సెంట్లలో స్లాబ్ లెవల్ బిల్డింగ్‌లను నేలమట్టం చేసి 20 సెంట్లలో వెకెంట్ ల్యాండ్, 10 సెంట్లలోని అనైన్మెంట్ ల్యాండ్‌ను ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న తరువాత తమ ల్యాండ్ కోసం పోరాడేందుకు 2016లో హైదరాబాదులోని హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. అక్కడ డబ్ల్యూపీ నెంబరు. 41894/2016గా నమోదు చేశారు. దీంతో 2018లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు అత్యవసర మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను రెవెన్యూ, టీటీడీ ఆదేశాలను పెడచెవిన పెట్టారు. దీంతో ఈ సమస్యను అనేక మార్లు కలెక్టర్, ఆర్‌డీఓ, ఎంఆర్‌ఓలకు వినతిపత్రం రూపంలో తీసుకెళ్లగా, స్పందించిన అప్పటి కలెక్టర్ బాబురావు, అప్పటి ఆర్డీఓగా ప్రస్తుత టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎంఆర్‌ఓగా శిరీషా 0.25 సెంట్లకు మార్కెట్ వ్యాల్యు వేసి వన్ ప్లస్ వన్ ఇస్తామని చెప్పారని వివరించారు. కానీ ఆనాడు బాధితులు వారు వదులుకున్న 43.5 సెంట్లకు ఇంకా రెండు బిల్డింగులకు వ్యాల్యుయేషన్ చేయాలని అధికారులకు విన్నవించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి దాకా నష్టపరిహారంపై ఊసే లేదు. కాకపోతే బాధితులు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో 2024లో తమ ఆస్తులను పడగొట్టినప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు మరలా సీఎం కావడంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. దీంతో కడప ఆర్డీఓ కార్యాలయం నుంచి పిలుపు రావడంతో వెళ్లి బాధితులకు ఆర్డీఓ కార్యాలయం వారు ఒక డిమాండ్ పత్రం ఇచ్చి దానికి ఒప్పుకోవాలని ఒత్తిడి చేయగా బాధితులు నిరాకరించారు. మరలా సమస్యను 2025లో సీఎం దృష్టికి వినతుల రూపంలో తీసుకెళ్లడంతో మరలా కడప ఆర్డీఓ కార్యాలయం నుంచి మళ్లీ నోటీసుల అందాయి. తాము ఇచ్చిన నష్టపరిహారాన్ని తీసుకోవాలని అల్టిమేటం జారీ చేయడంతో.. బాధితులు తాము తీవ్రంగా నష్టపోతామని ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు సమస్యను విన్నవించినా అధికారులు విన్నపాలను పరిగణించలేదు. పరిహారం కోసం ఏళ్లుగా తిరుగుతూ అనారోగ్యం పాలవ్వడమే కాక మానసిక క్షోభకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శ్రీరాముని ఆలయ అభివృద్ధి కోసం తీసుకున్న తమ స్థలానికి న్యాయమైన విలువను కట్టి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

సారూ.. న్యాయం చేయండి..

నా పేరు యనమల వెంకట రమణయ్య, నాది మండల కేంద్రంమైన ఒంటిమిట్ట. నా స్థలంలో ఉన్న నిర్మాణాలను, స్థలాన్ని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం అభివృద్ధి కోసం 2015లో ఎలాంటి నోటీసులు, నష్టపరిహారం గాని ఇవ్వకుండా కూల్చేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో నేను హైకోర్టును ఆశ్రయించి, నష్టపరిహారం న్యాయబద్ధంగా ఇవ్వాలని ఆర్డర్ తీసుకువచ్చినా, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. డయాలసిస్ పేషంట్ అయిన నన్ను అధికారులు మరింత వేదనకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు సానుకూలంగా స్పందించి తనకు న్యాయం చేయాలని రు.

పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు పంపిణీ



పనిముట్లను పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శివయ్య

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం పనిముట్లను పంపిణీ చేశామని పంచాయతీ క్యారదర్శి శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో భాగంగా పనులు చేసేటప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలను అందించామన్నారు. కార్మికులకు హెల్మెట్లు, బూట్లు, సేఫ్టీ జాకెట్లు, శానిటేషన్ వస్తువులు అందజేసినట్లు చెప్పారు. చెత్తసేకరణ సంపద కేంద్రం ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు జామ, ఉసిరి, కానుగ, దానిమ్మ, వేప, నేరేడు తదితర పండ్ల చెట్లను పెంచుతామని, దీని వల్ల అటవీ ప్రాంతాల్లో ఉన్న పక్షులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, టీడీపీ పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



వెంకట్రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ పాన్నేళ్లవాండ్లపల్లెకు చెందిన డిసిసిబి సింగల్ విండో మాజీ డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి కోడలు సలికిరెడ్డి మహేశ్వరి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, గున్నికుంట్ల సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, నాగరాజుయాదవ్, శివశంకర్‌యాదవ్‌లతో కలసి మృతదేహానికి నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలానే మహేశ్వరి మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

దోభి ఘాట్‌ను అందుబాటులోకి తేవాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న రజక సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : పట్టణంలో గున్నికుంట్ల మార్గంలో నిరుపయోగంగా ఉన్న దోభి ఘాట్‌ను వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని జిల్లా రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు కమిషనర్‌ను కలుసుకుని మాట్లాడుతూ గున్నికుంట్ల మార్గంలో ఉన్న దోభి ఘాట్ వద్ద ఉన్న బోరు మోటారు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఫలితంగా నీరందక కొన్నినెలలుగా బట్టలు ఉతకలేక తల్లడిల్లుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలోని పలు దోభి ఘాట్‌ల వద్దకూడా తగు సౌకర్యాలు కల్పించి రజకులను ఆదుకోవాలంటూ కోరారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో రజక సంఘం నేత ఆనంద్ పాల్గొన్నారు.

సోలార్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గాలివీడు : తూముకుంట సోలార్ నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ శ్రీనువాసులు హామీ ఇచ్చారు. బుధవారం మండలకేంద్రంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోలార్ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదనపు సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం 141ఎకరాల భూ సేకరణలో భాగంగా రైతులతో ముఖాముఖిగా చర్చించారు. గతంలో ఏ విధంగా అయితే హంద్రీనీవా కాలువ కోసం ఎకరాకు రూ.6లక్షల పరిహారం చెల్లించారో అదే విధంగా ఇప్పుడూ అంతే మొత్తాన్ని చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. అయితే నష్టపరిహారం ఖరారు చేసే అధికారం కలెక్టర్ పరిధిలో ఉన్నందున మీ వినతులను ఆయన దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆర్డీఓ రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బాలజీ, మండల సర్వేయర్ మురళి, రైతులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ, వాటర్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఇంజనీరింగ్ విభాగం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల పని గంటలను పెంచి కేవలం రూ.15వేలు వేతనంగా అందిస్తుండడం దారుణమన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు కూడా పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా రూ. 21వేల వేతనాన్ని చెల్లించాలంటూ కోరారు. కార్మికుల వయోపరిమితిని 62 వేలకు పెంచి ఆప్కాస్‌ను కొనసాగించాలన్నారు. లేనిపక్షంలో కార్మికులను క్రమబద్ధీకరించాలంటూ తెలియజేశారు. కార్యక్రమంలో కార్మికులు దేవ, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

లక్కిరెడ్డిపల్లి : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ స్టేషన్ అగ్నిమాపక అధికారి రామయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గద్దగుండ్ల రాచపల్లిలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మూడవ రోజు అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ ప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అలానే వివిధ అగ్ని ప్రమాదాలపై మంటలు ఆర్పే పద్ధతులను ప్రజలకు డెమో ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములపై ఆరా

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో ఉన్న దేవాలయ భూములపై జిల్లా దేవాలయ శాఖ అధికారి విశ్వనాథ్ బుధవారం ఆరా తీశారు. ఆ గ్రామంలో వరదరాజస్వామి, మూలస్థానేశ్వర స్వామి, వేములమ్మ దేవాలయాలకు సంబంధించి భూముల స్థితిగతులపై ఆయన ఆరా తీశారు. అలాగే దేవాలయ అర్చకుల పనితీరుపై విచారించారు. దేవాలయాలకు సంబంధించిన భూములను దేవాలయం పేరుతో పాసు పుస్తకాలు జారీ చేయాలని తహసీల్దార్‌ను కోరనున్నట్లు వారు తెలిపారు. దేవాలయాలకు సంబంధించిన పలు సమస్యలపై అర్చకులతో చర్చించారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

రామాపురం : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి రైతులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో పథకం కింద దరఖాస్తు చేసుకునే రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండాలని, చిన్నా, సన్న రైతులుగా తహసీల్దార్ ధృవీకరించాలని, 5 ఎకరాల తక్కువ భూమి కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు పాసుపుస్తకం నకలు, తహసీల్దార్ ధృవీకరించిన పత్రాలు, పండ్ల తోటలో సాగు చేసే భూమి ఫోటో రైతు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, రేషన్, ఆధార్, జాబ్‌కార్డు నకలు బావి, బోరు, నీటి ఆధారం ఉన్న రైతులు(చీనీ, నిమ్మ, తోటలు సాగు చేయవలసిన రైతులు) కరెంటు బిల్లు, జిరాక్స్, భూసార పరీక్ష పత్రం దరఖాస్తుతో పాటు జత చేయాలన్నారు. మరిన్ని వివరాలకు జాతీయ ఉపాధి హామీ ఏపీఓను, క్షేత్రస్థాయి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంటు రైతులు సంప్రదించాలని తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో రాణించిన విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ వంద శాతం ఉత్తీర్ణత సాధించామని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాజకుమార్ తెలిపారు. బుధవారం మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు ఘన విజయం సాధించారని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ మార్కులతో రాణించిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయించండి

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీవీఎం పురం గ్రామానికి శ్మశాన స్థలాన్ని కేటాయించాలని ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ అమరేశ్వరీకి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌తో మాట్లాడుతూ రెండు తరాలుగా మా గ్రామం ఆనుకొని వంక పక్కన ఉన్న స్థలంలో శవాలను పూడ్చుకుంటూ గాజు, పూస తీసుకుంటున్నామని తెలిపారు. ఆ శ్మశాన స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు నాయకులు కంకణం కట్టుకున్నారన్నారు. సదరు స్థలాన్ని ఆక్రమణ నుంచి రక్షించి తమకు మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని గ్రామస్తులతో అన్నారు.

జీవ శిలీంద్రాలు, బ్యాక్టీరియతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సిద్ధవటం : మండలంలోని వంతాటిపల్లె, ఎస్. రాజంపేట గ్రామాల రైతులకు బుధవారం జీవ శిలీంద్రాలు, బ్యాక్టీరియ ప్రాముఖ్యత, ఉపయోగాల గురించి అవగాహన కల్పించామని తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవ శిలీంద్రాలు అయినటువంటి ట్రైకోడెర్మా విరిడి, బ్యాక్టీరియా సూడోమోనస్ రైతులు ఉపయోగించడం ద్వారా మట్టిలో ఉన్నటువంటి హానికరమైన బ్యాక్టీరియా, శిలీంద్రాలను నశింపజేస్తాయన్నారు. తద్వారా పంటలకు ఆశించే తెగుళ్ల తగ్గుతాయన్నారు. జీవ శిలీంద్రాలతో రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.

విత్తన శుద్ధి చేసుకునే విధానం

- 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడిని ఒక కిలో విత్తనంతో కలిపి వాడాలన్నారు
- 1కిలో ట్రైకోడెర్మావిరిడిని 100 కిలోల పశువుల ఎరువులతో కలిపి కల్చర్ తయారు చేసుకొని ఎకరా భూమిలో చల్లుకోవాలన్నారు
- వరి పంటలో నారుమడిని ప్రధాన పొలంలో నాటే ముందు 10 నుంచి 15 నిమిషాలు ట్రైకోడెర్మా విరిడి నీటిలో వరి నాట్లను వేర్లు తడిచేలా ముంచి తరువాత నాటుకోవాలన్నారు
- గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమంలో (ఆర్ఏడబ్ల్యూఈపీ) భాగంగా పంటలకు ఆశించే తెగులు, కీటకాల గురించి రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రేమ్, రైతులు పాల్గొన్నారు.

కూలీ డబ్బులు ఎప్పుడిస్తారు సారూ



డబ్బులు పడక తమ గోడును తెలియజేస్తున్న ఉపాధి కూలీలు

సిద్ధవటం : ఉపాధి హామీ కూలీలకు పనులు చేపట్టిన దినాలకు సంబంధించి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారు అని టక్కోలు ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని టక్కోలు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు బుధవారం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గత ఏడు వారాలుగా పనులు చేపట్టిన దినాలకు డబ్బులు మంజూరు కాలేదని కూలీలు అన్నారు. అధికారులు చూపెట్టిన ప్రదేశాల్లో వేసవి కాలంలో ఉపాధి హామీ పనులను చేస్తున్నామన్నారు. గత ఏడు వారాలుగా కూలీ డబ్బులు మంజూరు కాకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని మాకు జీవనోపాధి పనులు తప్ప మరేమీ లేవని కూలీలు తమ గోడును వెలిబోసుకున్నారు. అధికారులు అయినా స్పందించి మాకు కూలీ డబ్బులు మంజూరు చేసి న్యాయం చేయాలని కూలీలు కోరుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు వివరణ కోరగా కూలీలు పనులు చేసిన దినాలకు డబ్బులు మంజూరు కాలేదని జిల్లాలో అందరికీ ఇదే పరిస్థితి ఉందని, ఉన్నతాధికారులకు కూలీ డబ్బులు మంజూరు చేయాలని నివేదికను పంపించామని మంజూరు అయిన వెంటనే ప్రతి ఒక్కరికీ చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

రామాపురం : విద్యార్థులు చదువుతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌బీఐ లైఫ్ తిరుపతి రిటైర్డ్ మేనేజర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బిట్స్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌హెచ్‌జీబీ ఎంఎంఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ యువత ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులు ఆడుతూ ఆర్థిక అక్షరాస్యత లేక ఇష్టం వచ్చినట్లు తమ ఖాతాలోని డబ్బులను వృథా చేస్తూ మోసపోతున్నారని, మరి కొంతమంది తమ జీవితాల్లోనే నాశనం చేసుకుంటారన్నారు. బ్యాంక్ సేవలతో పాటు ప్రభుత్వ బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఐ ఎల్‌టీఎం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఖాతాలకు నామినీ ఆధార్, పాన్‌కార్డు, మొబైల్ నెంబరు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. తమ ఖాతాలు వివరాలను ఎవరు తెలియకుండా గోప్యంగా ఉండాలన్నారు. కళాజాత బృందంతో పాటలు రూపంలో మ్యాజిక్ రూపంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీబీ ఎంఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు రాచరాయుడు, వెంకటేసు, వెంకటయ్య, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించకపోతే తీవ్ర నష్టం



మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేరి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు విధానంలో కొత్తగా తీసుకురావడం వల్ల కొన్నేళ్లుగా పనిచేసిన కార్మికులు కుటుంబాలు వీధిన పడతాయన్నారు. కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం కనికరం చూపాలన్నారు. 62 యేళ్ల తర్వాత పదవీ విరమణ కల్పించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉద్యమించకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల చూపుతున్న వైఖరిని ఉపసంహరించుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికనేతలు లక్ష్మీదేవి, ప్రసాదు, ప్రమీలమ్మ, రమణమ్మ, రెడ్డయ్య, కోటయ్య, జీ.రమణ, కోదండమ్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.